MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణ దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 22-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# సంగారెడ్డి ప్రజలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు

- దసరా వేడుకల్లో జగ్గారెడ్డి భావోద్వేగ ప్రసంగం
- బీపీ, షుగర్ ఉన్నవారు మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలి
- తల్లిదండ్రుల ఆరోగ్యంపై పిల్లలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- అంబేద్కర్ స్టేడియంలో అంబరాన్నంటిన దసరా సంబరాలు
- జమ్మిపూజ, రావణ దహనం.. ఆకట్టుకున్న బాణసంచా, డ్రోన్ల ప్రదర్శన
- సంగారెడ్డి ప్రజలంతా నా కుటుంబ సభ్యులే

2లో






## జోగిపేట ఎస్సై నిర్వాకం

### ఫిర్యాదు దారుడిపైన దాడి

# రక్షించాల్సిన ఖాకీనే దాడికి దిగితే.. బాధితుడు ఎవరిని ఆశ్రయించాలి?

## న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. అక్కడే అన్యాయం జరిగిందా?



దాడికి గురైన బాధితుడి గాయం...

- ఫిర్యాదు చేసిన బాధితుడికే వేధింపులా.. ఇదేనా పోలీసుల విధి నిర్వహణ?
- కేసు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించరా?
- ఖాకీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందా? విచారణతోనే నిజాలు బయటపడాలి!
- పోలీస్ స్టేషన్‌లోనే బాధితుడికి భద్రత కరువైతే.. సామాన్యుడికి రక్షణ ఎక్కడ?
- అన్నదమ్ముల భూవివాదంలో పోలీసుల పాత్రపై అనుమానాలు.. ఉన్నతాధికారుల విచారణ ఎప్పుడు?
- బాధితుడి ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు ఎప్పుడు?
- చట్టాన్ని కాపాడాల్సిన వారిపైనే ఆరోపణలు.. పోలీస్ శాఖ సమాధానం చెప్పాల్సిందే!

2లో

**ఖాకీపై ఆరోపణలు.. న్యాయం కోసం బాధితుడి ఎదురుచూపులు.. విచారణతోనే నిజానిజాలు తేలాలి!**

**జోగిపేట, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 21:** తనపై దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన బాధితుడిపైనే ఎస్సై, సిబ్బంది దాడి చేశారన్న ఆరోపణలు సంగారెడ్డి జిల్లా జోగిపేటలో కలకలం రేపుతున్నాయి. ఇట్టి విషయం ఆలస్యంగా వెలుగులోగి వచ్చింది.




## 'ఇది హిందువుల ఈవెంట్.. నువ్వెందుకు వచ్చావ్'.. ఎంవీఎస్ఆర్ కాలేజీలో ముస్లిం బౌన్సర్‌ను నిలదీసిన యువకులు!

'ఇది హిందువుల కార్యక్రమం.. నువ్వెందుకు వచ్చావ్?' అంటూ ఓ ముస్లిం బౌన్సర్‌ను కొందరు యువకులు నిలదీశారు. ఈవెంట్ నిర్వాహకులే తనను విధులకు పంపించారని చెబుతున్నా వినిపించుకోకుండా ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని నాదర్గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన దాండియా వేడుక సందర్భంగా జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ దాండియా కార్యక్రమానికి నిర్వాహకులు భద్రత కోసం బౌన్సర్లను నియమించారు. వారిలో ఫరీద్ అనే ముస్లిం బౌన్సర్ కూడా ఉన్నారు. అయితే, కొందరు యువకులు ఆయనను మతం పేరుతో ప్రశ్నిస్తూ దురుసుగా మాట్లాడారు. 'నీకు సోషల్ మీడియా ఉంది కదా.. హిందువుల పండుగలకు ముస్లిం బౌన్సర్లు రావొద్దని ప్రచారం జరుగుతోంది కదా.. మరి నువ్వెందుకు వచ్చావ్?' అని ప్రశ్నించారు. వైరల్ అవుతున్న వీడియోలో ఆ మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఇలా ముస్లిం బౌన్సర్‌ను వేధించడమే కాకుండా.. తామేదో ఘనకార్యం చేసినట్లుగాగా వీడియో తీసి మరీ సోషల్‌మీడియాలో పోస్టు చేశారు.

క్రైమ్ మిర్రర్
గురువారం 22-10-2026

# సంగారెడ్డి ప్రజలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 21:** బీపీ, షుగర్‌తో బాధపడుతున్న కుటుంబ సభ్యులు వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకునేలా ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. ప్రతిరోజూ దేవుడిని మొక్కే ముందే బీపీ, షుగర్ ఉన్నవారు మందులు వేసుకోవాలని, ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం పిల్లల బాధ్యత అని పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన దసరా వేడుకలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని రామమందిరంలో భజన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజనలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శావను రామమందిరం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్టేడియంలో మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు జమ్మిపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన రావణ దహన కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది. ఆకాశంలో బాణసంచా వెలుగులు, డ్రోన్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సినీ నేపథ్య గాయకుల సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. వేడుకలకు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డి ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. “నలభై ఏళ్ల క్రితం ఇదే మైదానంలో స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నాను. ఆనాటి నుంచి నేటి వరకు సంగారెడ్డితో నా అనుబంధం కొనసాగుతోంది. నన్ను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకొచ్చింది ఇక్కడి ప్రజలే” అని అన్నారు. ప్రతి ఏటా సంగారెడ్డి ప్రజలతో కలిసి పండుగలు జరుపుకోవడానికి తాను



ప్రాధాన్యమిస్తానని తెలిపారు. దసరా వేదికను రాజకీయాల కోసం ఉపయోగించుకోలేదని, ఈ వేదికపై ఎప్పుడూ ఓట్లు అడగలేదని చెప్పారు. తన మనసులోని మాటలను ప్రజలతో పంచుకోవడానికే ఈ వేదికను వినియోగిస్తానని పేర్కొన్నారు. “కుటుంబం అంటే కేవలం భార్య, పిల్లలు మాత్రమే కాదు, సంగారెడ్డి ప్రజలందరినీ నా కుటుంబ సభ్యులుగానే భావిస్తాను” అని జగ్గారెడ్డి అన్నారు. వయసు పెరిగేకొద్దీ తల్లిదండ్రుల ఆరోగ్యంపై పిల్లలు మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారు వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా చూడాలని కోరారు. కొడుకులు, కుమార్తెలతో పాటు కోడళ్లు కూడా ఇంట్లోని పెద్దల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన సంరక్షణ అందించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు తీవ్రతరం అయిన తర్వాత ఎంత ఖర్చు చేసినా కోల్పోయిన ఆరోగ్యాన్ని తిరిగి పొందడం కష్టమవుతుందని పేర్కొన్నారు. పండుగలు కేవలం ఆటపాటలు, వినోదానికే పరిమితం కాకుండా కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు పెంపొందించడానికి, పెద్దల పట్ల బాధ్యతను గుర్తుచేసుకోవడానికి కూడా ఉపయోగపడాలని జగ్గారెడ్డి తన ప్రసంగం ద్వారా సందేశమిచ్చారు.

# పిర్యాదు దారుడిపైన దాడి జోగిపేట ఎస్సై నిర్వాకం

అన్నదమ్ముల మధ్య తలెత్తిన భూవివాదం నేపథ్యంలో తనకు న్యాయం చేయాల్సిన పోలీసులే తనను వేధించారని, కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరించారని బాధితుడు మన్నే కిష్టయ్య ఆరోపిస్తున్నాడు. నాలుగు రోజులపాటు పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పారని, చివరకు తనపైనే దాడి చేశారని పేర్కొన్నాడు. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని బాధితుడు కోరుతున్నాడు. జోగిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన మన్నే కిష్టయ్యకు ఆయన అన్న మన్నే లక్ష్మయ్య, లక్ష్మయ్య కుమారుడు శ్రీధర్‌తో పొలం వద్ద వివాదం తలెత్తినట్లు బాధితుడు తెలిపాడు. సాయంత్రం 6 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, అదే సమయంలో కిష్టయ్య తన పొలంలోకి నీటిని మళ్లించడం గొడవకు కారణమైనట్లు పేర్కొన్నాడు. గతంలోనూ తండ్రి పేరుపై ఉన్న 4 ఎకరాల 18 గుంటల భూమి విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదాలు ఉన్నాయని తెలిపాడు. ఈ క్రమంలో తన అన్న, ఆయన కుమారుడు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డానని, ఆసుపత్రిలో చికిత్స పొందాల్సి వచ్చిందని కిష్టయ్య ఆరోపించాడు. తనను చంపేందుకు కూడా ప్రయత్నించారని పేర్కొన్నాడు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపాడు. తనపై జరిగిన దాడికి సంబంధించి ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, నాలుగు రోజులపాటు తనను తిప్పించుకున్నారని కిష్టయ్య ఆరోపించాడు. రాత్రి 10 గంటల వరకు స్టేషన్‌లో కూర్చోబెట్టి ఇంటికి పంపించారని, భయంతో జోగిపేటలోనే రాత్రి గడపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. గత శుక్రవారం మరోసారి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో ఎస్సై, సిబ్బంది తనపై దాడి చేశారని ఆరోపించాడు. తనపై దాడి చేసిన వారికే క్షమాపణ చెప్పాలని, వారి కాళ్లు మొక్కాలని ఒత్తిడి చేశారని తెలిపాడు. అందుకు నిరాకరించడంతో తనను కొట్టి, కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరించారని ఆరోపించాడు. బాధితుడి ఆరోపణలపై జోగిపేట ఎస్సైని క్రైమ్ మిర్రర్ ప్రతినిధి వివరణ కోరగా, “మేము కొట్టినట్లు మీ దగ్గర సాక్ష్యాలు ఉన్నాయా? బాధితులు చెప్పినదంతా నమ్ముతారా?” అంటూ తిరిగి ప్రశ్నలు వేశారు. అనంతరం ఫోన్ కట్ చేసినట్లు సరైన వివరణ ఇవ్వకుండా తప్పించుకున్నారు. అయితే పోలీసులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరణ వెలువడాల్సి ఉంది. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తిపై పోలీసులే దాడి చేశారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అయితే బాధితుడి ఆరోపణలు ఇంకా స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసేందుకు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని స్థానికంగా డిమాండ్ వినిపిస్తోంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, బాధితుడికి న్యాయం చేయాలని కోరుతున్నారు.





# దేవీ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చత్రపతి శివాజీ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో లెనిన్ నగర్ లో ఏర్పాటు చేసిన మండపంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతోపాటు పరస్పర ఐక్యత సోదర భావాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అండే కార్ వెంకటేష్, కార్యదర్శి బాలరాజు, మధుకర్, బిఆర్ఎస్ మహిళా నాయకురాలు జమాల్పూర్ సునీత బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరి ప్రాణాల్ని బలిగొన్న అతివేగం.. అలియాబాద్‌లో అర్ధరాత్రి ఘటన

శామీర్ పేట్, అక్టోబర్ 19 : అతివేగం ఇద్దరు వలసకూలీల ప్రాణాలను బలికొంది. ఈ సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జినోమ్ వాలీ పోలీస్ స్టేషన్ పరిధి అలియాబాద్ లో అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ కు చెందిన కాస్మోస్ మార్కి (22) అలియాబాద్ లో నివాసం ఉంటున్నాడు. సుమిత్ కుల్లు (23) బాలానగర్ లో ఉంటూ ఈ ఇద్దరు అలియాబాద్ మునిసిపల్ పరిధిలోని డైనమిక్ కంపెనీలో పనిచేస్తున్నారు. కంపెనీ దసరా దావత్ కు వెళ్లి తిరిగి ఆదివారం అర్ధరాత్రి బైక్ పై అలియాబాద్ లోని రూమ్ కి వస్తున్నారు. మార్గ మధ్యలో అలియాబాద్ బ్రింద రెడ్డి కన్వెన్షన్ ముందు అతివేగంగా వస్తున్న వీరి బైక్ చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్ట్ మార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గురువయ్య గౌడ్ తెలిపారు.



# లింగరావుపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-8 విజయవంతం

**విజేతగా పార్డేపురం జంగయ్య జట్టు.. ద్వితీయ స్థానంలో సద్దాం జట్టు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఐక్యత, స్నేహభావం, క్రమశిక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన లింగరావుపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో వివిధ జట్ల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. క్రికెట్ అభిమానులు ఆటలను ఆసక్తిగా తిలకిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ బూత్కూరు వెంకట్ రెడ్డి దాతలుగా సహకారం అందించారు. అలాగే క్రీడాకారులకు టీషర్టులు అందించేందుకు తిరుపతి గౌడ్, కుమార్ గౌడ్, ప్రవీణ్ కుమార్ గౌడ్, తిరుపతి, యాదయ్య, చిన్న అంజి, హరీష్ తమ వంతు సహకారం అందించారు. క్రీడల అభివృద్ధికి, యువతను ప్రోత్సహించేందుకు సహకరించిన దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన జట్లకు బహుమతులు అందజేసి అభినందించారు. మొదటి బహుమతి పార్డేపురం జంగయ్య జట్టు కైవసం చేసుకోగా రెండో బహుమతి సద్దాం జట్టు దక్కించుకుంది. ఈ సందర్భంగా



క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు జట్టుగా పనిచేయడం, క్రమశిక్షణతో ముందుకు సాగడం, విజయాపజయాలను సమానంగా స్వీకరించడం వంటి విలువలను నేర్పిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. యువత క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. లింగరావుపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-8 విజయవంతం కావడంతో క్రీడాకారులు, నిర్వాహకులు, క్రికెట్ అభిమానుల్లో ఆనందం నెలకొంది. టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



## శివాలయములో ఘనంగా అమ్మవారి పల్లకి సేవ

○ వైభవంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు శివాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిసాయి.దసరా రోజు ఎస్పై శోభన్ బాబు దంపతులు,సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ దంపతులు పాల్గొని గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం జమ్మి పూజలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..బుధవారం రోజు ఉదయం నిర్వహించిన అమ్మవారి పల్లకి సేవ లో గ్రామస్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు కొండోజు నవీన్ కుమార్ శిష్యబృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ,భక్తులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, ఆరిఫ్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, మైనారిటీ మండల అధ్యక్షుడు ఆరిఫ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతాంగ సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని కోరుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాలు కలగాలని ప్రార్థించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన బచ్చు రామకృష్ణ

**కొండారెడ్డిపల్లి హెలిప్యాడ్ వద్ద సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** దసరా పండుగ సందర్భంగా తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



# జయశంకర్ జిల్లాలో 'దసరా వెలుగులు'..!!

- ○ పల్లెపల్లెలో విజయదశమి వైభవం
- ○ పండుగ శోభతో కళకళలాడిన గ్రామాలు
- ○ జమ్మి ఆకులతో ఆత్మీయ పలకరింపులు
- ○ కుటుంబ బంధాలకు కొత్త కళ
- ○ సంప్రదాయాల సాక్షిగా విజయదశమి
- ○ ఆనందోత్సాహాల్లో జిల్లా ప్రజలు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగను జయశంకర్ భూపాలపల్లి జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో దసరా పండుగ సందడి నెలకొనగా, ప్రజలు సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే ఇళ్లలో పండుగ వాతావరణం కనిపించగా, కొత్త దుస్తులు ధరించిన చిన్నారులు, కుటుంబ సభ్యుల సందడితో పల్లెలు కళకళలాడాయి.

### పల్లెపల్లెలో పండుగ సందడి..!!

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో విజయదశమి వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగను పురస్కరించుకుని ప్రజలు తమ ఇళ్లను శుభ్రం చేసి అందంగా అలంకరించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించి, పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు చేరుకోవడంతో కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. చాలా రోజుల తర్వాత బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జమ్మి ఆకుల పంపిణీ.. బంగారంలా భావించి ఆత్మీయ పలకరింపులు దసరా పండుగలో ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన జమ్మి చెట్టు పూజలు, జమ్మి ఆకుల పంపిణీ సంప్రదాయం ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను చాటిచెప్పింది. జమ్మి ఆకులను బంగారంగా భావించి ఒకరికొకరు అందించుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెద్దల వద్ద ఆశీర్వాదాలు తీసుకుంటూ, చిన్నవారిని ఆశీర్వదిస్తూ కుటుంబ అనుబంధాలకు పెద్దపీట వేశారు. జమ్మి ఆకులను పంచుకోవడం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాకుండా, పరస్పర ప్రేమాభిమానాలకు, స్నేహసంబంధాలకు ప్రతీకగా నిలుస్తోంది. గ్రామాల్లో ప్రజలు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పండుగ సంతోషాలను పంచుకున్నారు. విజయదశమి దసరా పండుగ కుటుంబ సభ్యులను ఒక్కచోట చేర్చే ప్రత్యేక సందర్భంగా నిలిచింది.



కుటుంబ పెద్దల ఆశీస్సులు తీసుకోవడం, బంధుమిత్రులను కలుసుకోవడం, చిన్నారులతో కలిసి ఆనందంగా గడపడం వంటి దృశ్యాలు పండుగ ప్రత్యేకతను చాటిచెప్పాయి. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేయగా, చిన్నారులు కొత్త దుస్తులు ధరించి ఉత్సాహంగా గడిపారు. పండుగ సందర్భంగా కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు మరింత బలపడటంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో స్నేహసంబంధాలు, సామాజిక ఐక్యతకు విజయదశమి వేదికగా నిలిచింది. పాత పరిచయాలను గుర్తుచేసుకుంటూ, ఆత్మీయులతో సంతోషాలను పంచుకుంటూ ప్రజలు పండుగను ఆస్వాదించారు.

### చెడుపై మంచి విజయానికి ప్రతీక..

దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయాన్ని, శ్రీరాముడు రావణుడిపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ విజయదశమి పండుగను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ధర్మం, న్యాయం, సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తాయనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది. చెడు ఆలోచనలను విడిచిపెట్టి, మంచిని ఆచరిస్తూ ముందుకు సాగాలనే స్ఫూర్తిని ప్రజల్లో నింపుతుంది. ఈ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనూ ప్రజలు విజయదశమి పండుగను ఆనందంగా జరుపుకుంటూ, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వ్యవసాయ ఆధారిత గ్రామీణ ప్రాంతాల్లో దసరా పండుగకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. రైతులు తమ పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

# సూర్యుడి వెలుగులోనూ వీధి దీపాల వెలుగులు.. నూనెగూడెంలో విద్యుత్ వృథా!

రాత్రికి వెలుగులివ్వాల్సిన దీపాలు.. మిట్టమధ్యాహ్నమే వెలుగులు!

నూనెగూడెంలో నిర్వహణ లోపాలపై విమర్శలు.. అధికారుల పర్యవేక్షణ ఏదంటున్న గ్రామస్థులు!

రాత్రి వెలుగులకు దిక్కులేదు.. పగలే దీపాల వెలుగులెందుకు?

బయట ఎండలు మండుతున్నా.. వీధి దీపాలు వెలుగుతూనే!

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** పగటిపూట సూర్యుడి వెలుతురు సరిపోవడం లేదా? వీధి దీపాలు కూడా వెలగాల్సిందేనా? రాత్రిపూట ప్రజలకు వెలుగునివ్వాల్సిన దీపాలు మిట్టమధ్యాహ్నమే వెలుగుతూ విద్యుత్‌ను వృథా చేస్తున్న వైనం నూనెగూడెం గ్రామంలో కనిపించింది. ప్రజాధనం, విద్యుత్ పొదుపు గురించి మాట్లాడుతున్న వేళ.. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వీధి దీపాలు పగటిపూట వెలగడం నిర్వహణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం నూనెగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వీధి దీపాలు మధ్యాహ్న సమయంలోనూ వెలుగుతూ కనిపించాయి. రాత్రిపూట గ్రామ వీధులకు వెలుగులు అందించాల్సిన దీపాలు పగటిపూట కూడా పనిచేస్తుండటంతో విద్యుత్ వినియోగంపై పర్యవేక్షణ ఎక్కడుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించాల్సిన సంబంధిత సిబ్బంది ఈ విషయాన్ని ఎందుకు గుర్తించలేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**విద్యుత్ పొదుపు మాటలకే పరిమితమా?**

ఒకవైపు విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచనలు.. మరోవైపు అవసరం లేని సమయంలోనూ వీధి దీపాల వెలుగులు! ఇదేనా నిర్వహణ తీరు? పగటిపూట వీధి దీపాలు వెలగడం వల్ల ఎంత విద్యుత్ ఖర్చవుతోంది? ఇలాంటి పరిస్థితులు ఇతర ప్రాంతాల్లోనూ ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ వృథాను అరికట్టడం ప్రజల బాధ్యత మాత్రమే కాదు.. ప్రభుత్వ వ్యవస్థల నిర్వహణలోనూ భాగం కావాలి.

**"కొన్నిచోట్ల చీకట్లు.. ఇక్కడ పగటిపూట వెలుగులు"!**



కొన్ని ప్రాంతాల్లో రాత్రివేళ వీధి దీపాలు వెలగక ప్రజలు చీకట్లో ఇబ్బందులు పడుతుంటే.. నూనెగూడెంలో మాత్రం పగటిపూటే దీపాలు వెలగడం గమనార్హం. ప్రజలకు అవసరమైన సమయంలో వెలుగులు అందించడమే వీధి దీపాల ప్రధాన ఉద్దేశం. అలాంటప్పుడు పగటిపూట దీపాలు వెలుగుతున్నా పట్టించుకోకపోతే నిర్వహణ పర్యవేక్షణపై సహజంగానే ప్రశ్నలు తలెత్తుతాయి.

**"అధికారులు స్పందించేదెప్పుడు"?**

నూనెగూడెం గ్రామంలో పగటిపూట వీధి దీపాలు వెలుగుతున్న అంశంపై సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది వెంటనే పరిశీలన చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. అవసరం లేని సమయంలో దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు, వీధి దీపాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యుత్ వృథాను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై లేదా? పగటిపూట వెలుగుతున్న వీధి దీపాలపై చర్యలు తీసుకునేదెప్పుడు? నూనెగూడెం గ్రామస్థులు లేవనెత్తుతున్న ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పడంతోపాటు, సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.. పది నెలలైనా పూర్తికాని సబ్‌స్టేషన్!



శంకుస్థాపన చేసి 10 నెలలు.. ఇంకా నత్తనడకనే పనులు!

లోవోల్టేజీతో రైతుల అవస్థలు.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :** ఆరు నెలల్లో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.. కానీ పది నెలలు గడిచినా పనులు పూర్తి కాలేదు! శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా నిర్మాణం ఇంకా కొనసాగుతుండటంతో రైతుల ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. హామీ ఇచ్చిన గడువుకంటే నాలుగు నెలలు అదనంగా గడిచినా సబ్‌స్టేషన్ అందుబాటులోకి రాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుండాల మండల కేంద్రంలోని సీతారాంపురం గ్రామ సమీపంలోని నల్లరాళ్ల వద్ద సీతారాంపురం, మాసాన్‌పల్లి, మడిపడిగా గ్రామాల రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో జనవరిలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి రైతులకు మెరుగైన విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు.పది నెలలు పూర్తవుతున్నా నిర్మాణ పనులు ఇంకా కొలిక్కి రాకపోవడం పనుల పురోగతిపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

**"10 నెలలైనా తీరని విద్యుత్ కష్టాలు"!**

నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లోవోల్టేజ్ సమస్య తగ్గి వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని రైతులు



ఆశించారు. కానీ నిర్మాణంలో జాప్యం కారణంగా ఆ నిరీక్షణ ఇంకా కొనసాగుతోంది. లోవోల్టేజ్ వల్ల పంటలకు సరిపడా విద్యుత్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**"ఆరు నెలల గడువు ఎక్కడ? పది నెలలైనా ఎందుకు పూర్తి కాలేదు"?**

నిర్ణీత గడువు ఆరు నెలలు కాగా, ఇప్పటికే పది నెలలు గడిచాయి. అంటే హామీ ఇచ్చిన గడువుకు మించి నాలుగు నెలలు దాటినా నిర్మాణం పూర్తికాకపోవడం గమనార్హం. పనులు ఆలస్యం కావడానికి కారణాలేమిటి? సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారా? సబ్‌స్టేషన్ ఎప్పటికి అందుబాటులోకి వస్తుంది? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, జాప్యానికి కారణాలను స్పష్టం చేయాలని రైతులు కోరుతున్నారు. శంకుస్థాపన చేసి పది నెలలు గడిచినా పనులు పూర్తి కాకపోవడం రైతులకు నిరాశ కలిగిస్తోంది. ఇకనైనా అధికారులు చొరవ తీసుకుని సబ్‌స్టేషన్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# అనారోగ్యంతో మృతి చెందిన యువకుడి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం

కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా జిల్లెల్ల గ్రామానికి చెందిన గుమ్మకొండ వినయ్ కుమార్ అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయం స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న పలువురు నాయకులు మృతుడి కుటుంబానికి మొత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ రూ. 5,000, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రూ. 5,000, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం రూ. 5,000, మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య రూ. 2,000, మాజీ ఉప సర్పంచ్ పాండు గౌడ్ రూ. 2,500, మాజీ వార్డు సభ్యుడు చిక్కొండ ఆంజనేయులు రూ.500 అందించారు. మొత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి, అధైర్యపడవద్దని, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు సభ్యుడు ముత్యాల నరేష్, 6వ వార్డు సభ్యురాలు చిక్కొండ పద్మ, ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు ముత్యాల రమేష్, గుమ్మకొండ రమేష్, కుమ్మరి ఆంజనేయులు, ఎముక యాదయ్య, శ్రీను, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా విజయదశమి వేడుకలు

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల వ్యాప్తంగా గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా బొడ్రాయి వద్ద అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు చేపట్టి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబసభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద పూజలు చేసి కులమతాలకు అతీతంగా పరస్పరం జమ్మి ఆకులు పంచుకుంటూ ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతిసౌభాగ్యాలు నింపాలని భక్తులు ప్రార్థించారు. పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.





# ఘనంగా హైకోర్టు న్యాయవాది ఎంఏ రహీంకు సన్మానం!

**రెడ్‌క్రాస్ సొసైటీలో కీలక బాధ్యతలు.. గుండాల మీడియా మిత్రుల అభినందనలు!**

**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్‌గా, జిల్లా కోశాధికారిగా ఎన్నికైన ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎంఏ రహీంకు గుండాల మండల కేంద్రంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. గుండాల మీడియా మిత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ.. న్యాయవాదిగా ఎంతోమందికి న్యాయ సహాయం అందించడంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఎంఏ రహీంకు రెడ్‌క్రాస్ సొసైటీలో కీలక బాధ్యతలు దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పేద ప్రజలకు, ఆపదలో ఉన్నవారికి మరిన్ని సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఏ రహీం మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా పేద ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గుండాల మీడియా మిత్రులు తనకు ఘనంగా సన్మానం చేయడం ఎంతో ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాల మండలానికి చెందిన మీడియా ప్రతినిధులు ప్రముఖ జర్నలిస్టు యండి ఖలీల్,మలిపెద్ది ప్రభాకర్ రెడ్డి, ఆవుల సురేందర్, సిరిపురం దశరథ, బొమ్మగాని రాజు గౌడ్, సూదగాని హరికృష్ణ గౌడ్, చిలుకూరి మోహన్, పులి నరసయ్య, పురుగుల చిన్న మల్లేష్, సోమనారాయణ, అంబాదాస్, స్వామి, దశరథ యండి. ఉస్మాన్ తదితరులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కాలే యాదయ్యకు దసరా శుభాకాంక్షలు

**శంకర్ పల్లి కాంగ్రెస్ నాయకులు**

**క్రైమ్ మిర్రర్,శంకర్‌పల్లి:** దసరా పండుగ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను శంకర్‌పల్లి కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి, మొకిలా పీఏసీఎస్ చైర్మన్ గౌండ్ల సత్యం, గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్, గోపులారం సర్పంచ్ తంగడపల్లి రవీందర్ రెడ్డి, మొకిలా సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్, చేవెళ్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కాలే యాదన్నకు శుభాకాంక్షలు తెలిపారు



# చారిత్రాత్మక ఏఐకేఎస్ జాతీయ మహాసభలను విజయవంతం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను అత్యంత ఉద్యమ స్ఫూర్తి తో నిర్వహించబోతున్నామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ వెల్లడించారు. నవంబర్ 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ చారిత్రాత్మక మహాసభల వివరాలను ఆయన బుధవారం ఖమ్మం లోని సుందరయ్య భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో ఖమ్మం జిల్లాలో 26వ మహాసభలు జరిగాయని, సరిగ్గా 37 సంవత్సరాల తర్వాత మళ్లీ 1979లో ఖమ్మంలోనే జరిగాయని గుర్తుచేశారు. ఇప్పుడు 37 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత స్వతంత్ర తెలంగాణ గడ్డపై ఈ జాతీయ మహాసభలు జరగడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని ఆయన పేర్కొన్నారు . నవంబర్ 15న మహాసభల ప్రారంభం సందర్భంగా 15 వేల మంది క్రమశిక్షణ కలిగిన రెడ్‌షర్ట్ వాలంటీర్లతో భారీ ప్రదర్శన, కవాతు నిర్వహిస్తున్నామని, అలాగే లక్ష మందికి పైగా రైతులతో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయడానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతాంగం, ప్రజానీకం పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మహాసభల్లో పోరాట కార్యాచరణ

నల్లగొండలో జరగబోయే జాతీయ మహాసభల్లో భారత వ్యవసాయ రంగం, రైతాంగ భవిష్యత్తుపై లోతైన చర్చలు జరిపి, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేసే కార్యాచరణను రూపొందిస్తామని పోతినేని సుదర్శన్ వెల్లడించారు. ముఖ్యంగా వృద్ధాప్యంలోకి వచ్చిన పేద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు జీవించడానికి ఎటువంటి ఆధారమూ లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకోవడానికి నెలకు రూ. 10,000 పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టబద్ధమైన హామీతో కూడిన "కనీస మద్దతు ధరల చట్టం" తీసుకురావాలని స్పష్టం చేశారు. స్వతంత్రంగా, ఐక్యంగా నిర్వహించే భవిష్యత్ ఉద్యమాల ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, దేశీయ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఈ 36వ జాతీయ మహాసభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు. దాంతో పాటు దేశంలోని నిరంకుశ భూస్వామ్య వ్యవస్థకు, సంస్థానాల దోపిడీకి, నైజాం అణచివేతకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేసిందన్నారు.ముఖ్యంగా 1946వ సంవత్సరంలో "దున్నేవాడికే భూమి కావాలి", "వెట్టిచాకిరి రద్దు కావాలి" అనే ప్రధాన డిమాండ్లతో రూపుదిద్దుకున్న వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఈ ఏడాదితో 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 80వ వార్షికోత్సవాన్ని కూడా సగర్వంగా జరుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు. బ్రిటిష్ వారు




వెళ్ళిపోయినప్పటికీ దేశంలో భూ సమస్యలు, సాగు సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని, నాటి నుండి నేటి వరకు గిట్టుబాటు ధరలు, రైతాంగ హక్కుల కోసం నిరంతరం అఖిల భారత రైతు సంఘం శ్రమిస్తోందని పేర్కొన్నారు.

## కార్పొరేట్ కొమ్ముకాసే ఒప్పందాలు రద్దు చేయాలి

కేంద్రంలో అధికారంలోకి రావడానికి ముందు నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అనేక వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందని పోతినేని సుదర్శన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పక్కాగా అమలు చేస్తామని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ మాటలన్నింటినీ తుంగలో తొక్కిందని విమర్శించారు. దేశ వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తూ, కార్పొరేట్ శక్తులకు, బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేసే కుట్రలకు కేంద్రం పాల్పడుతోందన్నారు.

## రైతుల పాలిట మరణశాసనాలు

కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విద్యుత్ విధానం, విద్యుత్ సవరణ బిల్లులు దేశ రైతాంగం పాలిట మరణశాసనంగా మారాయని పోతినేని సుదర్శన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్, సరసమైన ధరలకు విద్యుత్ లభించే హక్కులను లాక్కొని, విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా ప్రశ్నార్థకంగా మారుతుందని విమర్శించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు సరైన భద్రత కల్పించేలా రైతు బీమా చట్టంలో సమూల మార్పులు చేసి మెరుగైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉచిత విద్యుత్ హక్కుతో పాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా దసరా వేడుకలు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వంటేరు నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం 59వ డివిజన్ గాయత్రి నగర్ లో ఆదివారం సద్దుల బతుకమ్మ, మంగళవారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించి ఉత్సవాల్లో భాగంగా మహిళా మణులు బతుకమ్మ ఆట పాటతో ప్రారంభించి జమ్మి పూజ, రావణ దహన, బతుకమ్మ బహుమతులు, అతిథులకు సన్మాన కార్యక్రమాలు, జమ్మి పూజ, రావణ దహన కార్యక్రమం అనంతరం రామ్ నరసయ్య, సద్దుల బతుకమ్మ రోజు బతుకమ్మలు తెచ్చిన 300 మంది ఆడపడుచులకి చీరలు బహుకరించడం జరిగింది. కార్యక్రమానికి సహకరించిన పెద్దలకు కమిటీ సభ్యులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఫెడరేషన్ సెక్రెటరీ మాట్లాడుతు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన పెద్దలకు ఇక్కడికి



వచ్చిన ముఖ్య అతిథులకు కాలనీ అసోసియేషన్స్ కి ప్రజలకి ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ప్రజలకి దసరా శుభాకాంక్షలు తెలపడం జరిగింది.



# బొల్లంపల్లిలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**ప్రత్యేక పూజలు నిర్వహించిన జక్కుల చిన్న జంగయ్య యాదవ్**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జియాగూడ యాదవ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బొల్లంపల్లి గ్రామానికి చెందిన జక్కుల చిన్న జంగయ్య యాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్గాదేవి కృపతో గ్రామ ప్రజలతో పాటు మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విజయదశమి వేడుకలను ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కళాకారులు ప్రదర్శించిన కోలాటాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. అనంతరం కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులతో పాటు పలువురిని జక్కుల చిన్న జంగయ్య యాదవ్ శాలువాలతో సన్మానించారు. ఈ ఉత్సవాల్లో మాజీ సర్పంచ్ ఉప్పు అపర్ణ తిరుమలరావు, మండల శ్రీనివాస్ యాదవ్, సత్తూరి బాలస్వామి గౌడ్, ఆదర్శ యూత్ అధ్యక్షుడు కానుగుల వెంకటయ్య, కనకాచారి, యాదగిరి, సంజీవ్ రావు, కమిటీ సభ్యులు శ్రీహరి, మల్లేష్, వెంకటేష్, లక్ష్మయ్య, సాయి, రమేష్, జంగయ్య, మల్లేష్, నిరంజన్, లింగం, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు

**క్రైమ్ మిర్రర్,శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ జన్మదినం సందర్భంగా శంకర్‌పల్లి చౌరస్తాలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రమౌళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి మోహన్, డీసీసీ ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జన్వాడ సమీపంలోని అనాథాశ్రమంలో నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు అందజేశారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం జరిగింది.



# సింగరేణికి పూర్వవైభవం తెస్తాం: మంత్రి వివేక్ వెంకటస్వామి

- మందమర్రిలో ఘనంగా విజయదశమి వేడుకలు.. సప్త వ్యసనాల రాక్షస దహనంలో పాల్గొన్న మంత్రి
- చెన్నూర్ నియోజకవర్గంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు..
- సింగరేణి భూములిస్తే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి స్పష్టత



**మందమర్రి అక్టోబర్ 21 క్రైమ్ మిర్రర్:** సింగరేణి సంస్థను పరిరక్షించి, పూర్వవైభవం తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, గనుల, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కొత్త బొగ్గు గనుల ఏర్పాటుతోనే మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం మందమర్రిలోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సప్త వ్యసనాల రాక్షస దహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు శ్రీ వెంకటేశ్వర స్వామి శోభాయాత్రలో పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు, సింగరేణి కార్మికులు, అధికారులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సంస్థ ఏటా దసరా వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. తాను మూడోసారి ఈ ఉత్సవాలకు హాజరవుతున్నానని, ప్రతిసారీ చక్కటి ఏర్పాట్లు చేస్తున్నారని నిర్వాహకులను అభినందించారు. 1995లో సింగరేణి సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నప్పుడు తన తండ్రి కాకా వెంకటస్వామి ఎన్టీపీసీ నుంచి రూ. 400 కోట్ల రుణం ఇప్పించి లక్ష మంది కార్మికుల ఉద్యోగాలను కాపాడారని మంత్రి గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. సింగరేణి ప్రాంతంలో ఉద్యోగాలు కల్పించడంతోపాటు సంస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల వేలంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఎంపీ వంశీకృష్ణతో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశామని, ఆర్కేసీ గనితోపాటు తాడిచెర్ల, మణుగూరు బొగ్గు గనులు కేటాయించబడ్డాయని పేర్కొన్నారు. కొత్త గనులు అందుబాటులోకి వస్తేనే ఉద్యోగ అవకాశాలు పెరిగి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. తన తండ్రి బాటలో సింగరేణి ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.



**మందమర్రిలో రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు**

చెన్నూరు నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సుమారు రూ. 1,000 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. మందమర్రి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అమృత్ పథకం కింద రూ. 30 కోట్లతో ఇంటింటికీ తాగునీటి నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరో రూ. 100 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టామని, వాటిని వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు త్వరలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు.

**సింగరేణి భూములిస్తే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు**

మందమర్రి ఏజెన్సీ ప్రాంతం కావడంతో పట్టా భూములు లేక నిరుపేదలు ఇళ్లు నిర్మించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి పేదలకు సొంత ఇళ్లు కల్పించేందుకు సింగరేణి సంస్థ 15 నుంచి 20 ఎకరాల భూమిని ప్రభుత్వానికి కేటాయించాలని కోరారు. భూమి అందుబాటులోకి వస్తే అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, ఏఐటియుసి అధ్యక్షులువాసిరెడ్డి సీతారామయ్య,మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ, ఎస్ ఓ టు జి ఎం ఎల్ ప్రసాద్, మందమరి జడ్జి నిరోషా, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ,స్థానిక ప్రజాప్రతినిధులు, సింగరేణి అధికారులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయ దశమి దసరా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కూకట్ పల్లి, అక్టోబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** దసరా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి శాసనసభ్యులు, ప్రజా పద్దుల సంఘం అధ్యక్షులు అరికెపూడి గాంధీ తన సతీమణి శ్యామలాదేవితో కలిసి కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ అమ్మవారిని, సుమిత్రానగర్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, ఆలయ కార్యనిర్వహణాధికారి సమక్షంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. విజయదశమి పర్వదినం సందర్భంగా అమ్మవార్లను దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. రాష్ట్ర ప్రజలతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవార్లను మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల ప్రభావం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి వినియోగం విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విద్యుత్తును ఆదా చేయండి.. మంచినీటిని పొదుపుగా వినియోగించండి అని ప్రజలకు ముఖ్య సందేశాన్ని ఇచ్చారు. ప్రకృతి వనరులను వృథా చేయకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని, విద్యుత్తును జాగ్రత్తగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజల మధ్య ఐకమత్యం, సోదరభావం పెంపొందాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్, సీనియర్ నాయకులు నాయినేని చంద్రకాంతరావు, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరిపై అమ్మవార్ల కరుణాకటాక్షాలు ఉండాలని ప్రార్థించారు.





# విజయదశమి సందర్భంగా కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కేటీఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్లు**

**కూకట్‌పల్లి, అక్టోబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందం, విజయాలను తీసుకురావాలని వారు కోరుకున్నారు. పండుగ సందర్భంగా నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. ఈ భేటీతో కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన భారత రాష్ట్ర సమితి నాయకుల మధ్య పండుగ సందడి నెలకొంది.



విజయ దశమి పండగ సందర్భంగా జిల్లేలగూడ, బిజెపి క్వార్టర్స్ హనుమాన్ దేవాలయ ఆవరణలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జమ్మి పూజలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నేత కోలను శంకర్ రెడ్డి(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)

# నేడు జరుగనున్న పండుగ సాయన్న జయంతి వేడుకలను విజయవంతం చేయండి..

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న వీరయోధుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా విజయవంతం చేయాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ ప్రముఖులు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్, మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో సిఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి పండుగ సాయన్న జయంతి (అక్టోబర్ 22), వర్ధంతి (డిసెంబర్ 10)లను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఇందుకు ముదిరాజ్ సమాజం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిరంకుశ రజాకార్లు, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ పేదలకు అండగా నిలిచిన పండుగ సాయన్న పాలమూరు రాబిన్‌హుడ్‌గా, పేదల పెన్నిధిగా చరిత్రలో నిలిచిపోయారని తలారి మైసయ్య కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

# పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

**ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర కీలకం**

**అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల అక్టోబర్ 21 ( క్రైమ్ మిర్రర్):** ప్రజల ప్రాణ, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, అవసరమైన సందర్భాల్లో ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని తెలిపారు. దేశ సరిహద్దుల రక్షణలో సైన్యం కీలక పాత్ర పోషిస్తుండగా.. అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను పోలీసులు సమర్థంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల రక్షణ పోలీసుల ప్రధాన కర్తవ్యాలని వివరించారు.రాష్ట్రంలో, దేశంలో శాంతిసామరస్యాలు నెలకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పోలీసుల అంకితభావంతో ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పౌరులు సామాజిక బాధ్యతతో వ్యవహరించి పోలీసులకు సహకరిస్తే శాంతిభద్రతల పరిరక్షణ మరింత సులభతరమవుతుందని తెలిపారు.



**అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది**

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ.. 1959 అక్టోబరు 21న భారత సరిహద్దులో గస్తీ విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బృందంపై శత్రు బలగాలు ఆకస్మికంగా దాడి చేశాయని తెలిపారు. ఈ ఘటనలో జవాన్లు వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. వారి త్యాగాలకు గుర్తుగా ఏటా అక్టోబరు 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.ప్రజల ప్రాణ, ఆస్తుల పరిరక్షణతోపాటు అంతర్గత భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యతలని అన్నారు. సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ శాఖ గౌరవాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి మహిళ దుర్గాదేవిలా హిందూ సంస్కృతి, దేశాన్ని రక్షించాలి

**శంకర్పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్**

**నిమజ్జనం సందర్భంగా భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ**

**క్రైమ్ మిర్రర్,శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్, ప్రతి మహిళ దుర్గాదేవి స్ఫూర్తితో హిందూ సంస్కృతి, దేశ రక్షణకు కృషి చేయాలని శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక విభాగం రంగారెడ్డి జిల్లా గ్రామీణ జాయింట్ కన్వీనర్ ఆర్. నరేష్ కుమార్ (సతీష్ కుమార్) పిలుపునిచ్చారు. దేవీ నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బుధవారం జరిగిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకొని శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ.. పురాణాల్లో దుష్టశక్తులను సంహరించి లోకానికి రక్షణ కల్పించిన దుర్గాదేవి శక్తి, స్త్రీల ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలను తక్కువగా చూడటం, వారిపై హింసకు పాల్పడటం వంటి చర్యలను సమాజం తీవ్రంగా వ్యతిరేకించాలని అన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ సమాజంలో చెడును ఎదుర్కోవాలని సూచించారు. దేశ రక్షణలో మహిళలు చూపిస్తున్న ధైర్యసాహసాలను ఈ సందర్భంగా ఆయన



ప్రస్తావించారు. దేశ భద్రత కోసం సైన్యంలో పనిచేస్తున్న మహిళా అధికారులు, సిబ్బంది సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేవీ నవరాత్రుల వంటి పండుగలు ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయ పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, భావితరాలకు మన సంస్కృతిని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ సభ్యులు మురళీకృష్ణ, వెంకటేష్, మధు, ఆంజనేయులు, విజయానంద్, పండరినాథ్, వడ్డే వెంకటేష్, బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక విభాగం నవాపేట్ మండల కో-కన్వీనర్ కేదారి ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# దసరా సందర్భంగా జగదీశ్వర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన యలమంచి ఉదయ్ కిరణ్..

**క్రైమ్ మిర్రర్ : శేరిలింగంపల్లి:** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ , టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జగదీశ్వర్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలియజేసి, పలువురు పార్టీ నాయకుల తో కలిసి పండుగ శుభాకాంక్షల వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దసరా పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు నింపాలని యలమంచి ఉదయ్ కిరణ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బేరి రాంచందర్



యాదవ్, గిరి, యాదన్న గౌడ్, ఎన్ ఎస్ యు ఐ కార్యదర్శి చంద్ర మౌళి, సతీష్, సాయి లోహిత్, శశి తదితరులు పాల్గొన్నారు.

# బుల్కాపురం గేట్ వద్ద ఫార్చ్యూనర్ బీభత్సం.. గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు!

**గొర్రెల కాపరికి భారీ నష్టం.. బాధితుడిని పరామర్శించిన బండమీది వెంకటేష్**

**బాధితుడికి రూ.4 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్**

**క్రైమ్ మిర్రర్,శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురం గేట్ వద్ద శంకర్‌పల్లి,హైదరాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం గొర్రెల కాపరి కుటుంబంలో విషాదాన్ని నింపింది. వేగంగా వచ్చిన టయోటా ఫార్చ్యూనర్ కారు రోడ్డు పక్కన ఉన్న గొర్రెల మందను ఢీకొట్టడంతో పెద్ద సంఖ్యలో గొర్రెలు మృత్యువాతపడగా, మరికొన్ని తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఈ ఘటనలో బాధిత గొర్రెల కాపరికి న్యాయం చేయాలని చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మండల కురుమ సంఘం అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త బండమీది వెంకటేష్ డిమాండ్ చేశారు.

### బాధితుడికి అండగా బండమీది వెంకటేష్

ప్రమాద విషయం తెలుసుకున్న బండమీది వెంకటేష్ వెంటనే ఘటనాస్థలికి చేరుకుని బాధిత గొర్రెల కాపరిని పరామర్శించారు. మృతి చెందిన గొర్రెలను పరిశీలించి, గాయపడిన గొర్రెల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గొర్రెలను కోల్పోయి ఆవేదనలో ఉన్న బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. గొర్రెల పెంపకమే జీవనాధారంగా బతుకుతున్న పేద కుటుంబాలకు ఇలాంటి ప్రమాదాలు తీరని నష్టాన్ని కలిగిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న కాపరి కుటుంబం ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందుల్లో పడటం బాధాకరమన్నారు.

### రూ.4 లక్షల నష్టపరిహారం అందించాలి

ప్రమాదంలో నష్టపోయిన గొర్రెల కాపరికి తక్షణమే రూ.4 లక్షల నష్టపరిహారం అందించాలని బండమీది వెంకటేష్ డిమాండ్ చేశారు.



ప్రమాదానికి కారణమైన వాహన యజమాని నుంచి చట్టప్రకారం నష్టపరిహారం ఇప్పించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి పోలీసులను కోరారు. అదేవిధంగా ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, గాయపడిన గొర్రెలకు ఉచిత పశువైద్య సేవలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### అతివేగాన్ని నియంత్రించాలి

ప్రధాన రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వెంకటేష్ కోరారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గొర్రెల కాపరుల జీవనోపాధికి నష్టం కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల తదుపరి చర్యల వివరాలు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. బాధిత గొర్రెల కాపరికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని బండమీది వెంకటేష్ తెలిపారు.

# మాదాపూర్ శిల్పారామం లో ట్రైబల్ మేళా ముగింపు వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు..




**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** శిల్పారామం మాదాపూర్‌లో నిర్వహించిన ట్రైబల్ మేళా ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ సభ్యులు, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ దుర్గా దాస్ ఉయికే విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన ఆది బజార్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆదివాసీ చేనేత, హస్తకళాకారులతో మాట్లాడి వారు తయారు చేస్తున్న ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అడవిలో లభించే సహజ వనరులతో కల్తీ లేకుండా, స్వచ్ఛతతో తయారు చేసిన ఉత్పత్తులను వాడితే ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. అనంతరం ఆదివాసీ కళాకారుల వద్ద పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. బుధవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీమతి సుస్మిత మిశ్రా శిష్య బృందం ఒడిస్సీ నృత్య ప్రదర్శనలో శ్రీ జగన్నాథ స్తుతి, స్థాయి, బాటు, పల్లవి, దుర్గా స్తుతి అంశాలను ప్రదర్శించారు. అలాగే శ్రీమతి, శ్రీ దేవి గిరీష్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో పూర్వరంగం, సూర్య స్తుతి, గజవదన బేడువే, బ్రహ్మాంజలి, దశావతారం, శంభో మహాదేవ, నమశ్శివాయతే అంశాలను ప్రదర్శించి మెప్పించారు. ఈ ప్రదర్శనల్లో లోహిత, శ్రీ మానవి, అనఘ, జాహ్నవి, జస్మిత, జోషిక తదితర కళాకారులు పాల్గొని ప్రేక్షకులను అలరించారు.



### రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కి దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

**కూకట్ పల్లి, అక్టోబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** విజయ దశమి సందర్భంగా కుటుంబ సమేతంగా వెళ్ళి రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి దంపతులను వారి నివాసంలో పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించి ఈ పవిత్ర సందర్భాన ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, ఐశ్వర్యం కలగాలని, మరిన్ని విజయాలు సాధించాలని దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# వనస్థలిపురంలో బంగారు ఆభరణాల చోరీ కేసు ఛేదింపు

**ఇద్దరు నిందితుల అరెస్ట్.. 30 గ్రాముల బంగారం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**ఎల్బీనగర్ అక్టోబర్ 21 (క్రైమ్ మిర్రర్) :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడుతో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపి కార్యాలయంలో బుధవారం సీఐ రవిబాబు తో కలిసి ఏసిపి శ్రీనివాస్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ ఉదయం సుమారు 6.04 గంటల సమయంలో వనస్థలి పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని హస్తినాపురం వెంకటరమణ కాలనీలోని రాజరాజేశ్వరి దేవాలయంలో పనిచేస్తున్న శ్రీమతి అండుగుల రాములమ్మ (66) మెడలో ఉన్న సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడును నిందితులు వాటర్ ట్యాంక్ డ్రైవర్ గా పని పనిచేస్తున్న అన్నపురెడ్డి దుర్గ రమణారెడ్డి (23) తండ్రి అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, ప్రైవేట్ హాస్టల్లో వంట పని చేస్తున్న వరలక్ష్మి (24)తండ్రి రాంబాబు వీరిద్దరూ రంగారెడ్డి జిల్లా గుర్రం గూడ నివాసమని స్వస్థలం కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఉప్పలంపాల గ్రామం స్వస్థలం అని ఆయన తెలిపారు. వీరిద్దరూ ఒంటరిగా ఉన్న మహిళలను వృద్ధ మహిళల లక్ష్యంగా చేసుకుంటూ బంగారు ఆభరణాలను దొంగలిస్తారని ఆయన తెలిపారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిసీసీటీవీ కెమెరాల సహాయంతో నిందితులను గుర్తించామని. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీకి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు ఎసిపి తెలిపారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ బి.అను రాధ పర్యవేక్షణలో కేసును చేదించామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు, ఎస్‌హెచ్‌ఓ ఎస్. రవిబాబు, డీఐ బి.రాజేష్,డీఎస్ఐ వి.రవి, ఎస్ఐ డి.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

